## నేరము శిక్ష

# కారు మీటర్

**- ఆదిత్య**

టీనా అద్దం ముందు నిల్చుని తన అందాలకు తుదిమెరుగులు దిద్దుకుంటోంది.

లోనెక్ స్కిన్ టైట్ జర్కిన్‌తో, బొడ్డు క్రిందకు జారిన హాఫ్ నిక్కర్‌తో హాట్ హాట్‌గా ఉంది. ఎర్రని పెదాలకు మరింత ఎర్రబడేలా లిప్‌స్టిక్ అద్దింది.

ఇలా రోడ్డు మీదకు వెళ్లానంటే కుర్రాళ్లంతా బేజా రైపోవడం ఖాయం అనుకుంది టీనా.

ఒక్కసారి గడియారం వైపు చూసుకుని అయ్యబాబోయ్ ఇంక అరగంట మాత్రమే ఉంది. వీధి మలుపులో మిళింద్ ఎదురుచూస్తుంటాడు అనుకుంటూ ఎత్తైన హీల్స్ వేసుకుని మేకప్‌కు చివరి అంకంగా ఘాటైన చార్లీ పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకుని బ్యాగ్ ఊపుకుంటూ బయలుదేరింది టీనా.

ఎవరైతే ఎదురవకూడదని వేయిదేవుళ్లకు మొక్కుకుందో ఆ శాల్తీ ఎదురవ్వనే ఎదురయింది. ఆమె దేవకీ మాథుర్, టీనా బామ్మ.

ఆఘమేఘాల మీద పరుగెడుతున్న టీనాను చూసి ''ఆగు...'' అంటూ ఒ కేక వేసింది.

'ఈ ముసలామెకు చిక్కిపోయానురా భగవంతుడా! ఇవ్వాళ నా పని అయిపోయింది..'అనుకుంటూ ఠక్కున ఆగింది టీనా.

తన కళ్లద్దాల కొసనుండి తీక్షణంగా చూస్తూ టీనా చుట్టు తిరుగుతూ-

''ఎక్కడికి...?' అంటూ నిలేసింది.

''మా ఫ్రెండింటికి...'' అని చెప్పింది టీనా.

''ఎవరా ఫ్రెండ్?''

''కాజల్...ఈ రోజు దాని బర్త్‌డే...''

''మళ్లీ ఎన్ని గంటలకు తిరిగొస్తావు?'' అడిగింది బామ్మ.



''బామ్మా... బర్త్‌డే పార్టీ అని చెప్పానుగా. కొంచెం పొద్దుపోతుంది అంతే''

''అదే ఎంత పొద్దవుతుందని...''

''అబ్బా...అదేంటి బామ్మా నేనేమన్నా చిన్న పిల్లననుకుంటున్నావా? పి.జి కంప్లీట్ అయింది. అంటే ఇరవై మూడేళ్ళు. నాన్న పోతూ పోతూ నాకు పాతికేళ్ళు వచ్చేవరకూ పెళ్లి చేసుకోవద్దన్నాడు. లేకుంటే పెళ్లి చేసుకుని ఇద్దరు పిల్లలకు తల్లినయి ఉండేదాన్ని...''అంది.

''ఛీ...ఛీ...ఏవిటా మాటలు. కలికాలం. ఈకాలం పిల్లలు మరీ బరితెగించారే. సరె...సరె..జాగ్రత్తగా వెళ్లిరా...'' అని జాగ్రత్తలు చెప్పి పంపించింది.

టీనా వెళ్లిన రెండు నిముషాలకే ప్రత్యక్షమయ్యాడు మేనేజర్ ద్వివేది.

''వెంటనే అమ్మాయిని ఫాలో అవు....వివరాలన్నీ చెప్పు...'' అంటూ ఆజ్ఞాపించింది దేవకీ మాథుర్.

* * *

బ్లూ మూన్ పబ్‌లో డిస్కోలైట్లు లయబద్ధంగా హోరెత్తే మ్యూజిక్‌కు అనుగుణంగా వెలుగుతూ ఆరిపోతున్నాయి.

అంతకంటే హుషారుగా కుర్రకారు జంటలు జంటలుగా ఒళ్ళెరగకుండా గంతులేస్తున్నారు.

టీనా, మిళింద్‌లు కూడా హుషారుగా స్టెప్పు లేస్తున్నారు.

''అవునూ, ఇవ్వాళేం కథ చెప్పొచ్చావు...?'' చెవిలో గుసగుసగా అడిగాడు మిళింద్.

''కాజల్ బర్త్‌డే...అని చెప్పాను'' కిలకిలా నవ్వుతూ చెప్పింది టీనా.

అదే ఫోజుతో స్టెప్పులేస్తూనే-

''అదిసరే.. మరి ఆ నక్షత్రకుడి కన్ను కప్పి ఎలా వచ్చావు..'' అంటూ అడిగాడు మేనేజర్ ద్వివేదిని ఉద్దేశించి.

''వాడి కళ్ళు కప్పి రావడం అసాధ్యం. దానికీ ఓ మార్గం ఉందిలే.... ఓ అయిదొందలు వాడి మొహాన కొట్టాను''

''మొన్న మీ ఇంటి దగ్గర నిన్ను డ్రాప్ చేయడం చూశాడు. నువ్వు లోపలికెళ్లగానే నా ముందు ప్రత్యక్షమయ్యాడు. నేనూ ఓ పచ్చనోటు చదివించుకున్నాలే''

వీళ్లిద్దరి సంభాషణ ఇలా సాగుతూంటే పబ్‌లో ఓ మూల నక్కి కూర్చున్న ద్వివేది గ్లాసులో విస్కీ లాగిస్తూ రేపు దేవకికి తను చూసిన దృశ్యాన్ని కథలు, కథలుగా చెప్పి ఎంత డబ్బు లాగొచ్చో ఊహించుకుంటూ మురిసిపోతున్నాడు.

కొంతసేపు విరామంగా టీనా, మిళింద్ పక్కనున్న టేబుల్‌పై కూర్చుని జ్యూస్ తాగసాగారు.

''టీనా ఇంకా ఎన్నాళ్ళీ దాగుడుమూతలు'' అడిగాడు మిళింద్.

''నాకూ అదే అర్థంకావడం లేదు. ఆ పెద్దావిడ నాకు పాతికేళ్ళు వచ్చేవరకూ పెళ్లికి ఒప్పుకునేలా లేదు..''

''పోనీ నేను వచ్చి మాట్లాడనా?''

''అప్పుడు ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వనంటుంది''

''దిక్కుమాలిన ఆస్తి పోతేపోనీయ్. నాకున్న క్వాలిఫికేషన్‌తో ఏదో ఓ ఉద్యోగం దొరక్కపోదు'' ధీమాగా అన్నాడు మిళింద్.

''సరే అలాగే చెయ్యి. అదే సరైన పద్ధతి అనిపిస్తోంది!''


''అలాగే..'' అంటూ అక్కడ్నించి ఇద్దరూ నిష్క్రమించారు.

వాళ్ళు బయలుదేరిన పదినిముషాలకు నక్షత్రకుడు ద్వివేది కూడా అక్కడినుండి బయలుదేరాడు.

* * *

మరునాడు ఉదయం దేవకీ మాథుర్ ముందు చేతులు కట్టుకుని నిలుచున్నాడు ద్వివేది.

''ఇక్కడ కాదు బయటకెళ్దాం'' అంటూ కారులో ద్వివేదిని ఇంట్లోంచి ఇండియాగేట్ దగ్గరకు తీసుకెళ్లింది.




అక్కడ ద్వివేది చెప్పిందంతా వింది. టీనాకు బుద్ధిచెప్పాలని నిశ్చయించుకుని ఇంటికి తిరిగొచ్చింది దేవకీ మాథుర్.

ఇంటికి రాగానే తన అలవాటు ప్రకారం డైరీలో కారు మీటర్ రీడింగ్, టైం రాసి ఇంట్లోకి అడుగు పెట్టింది బామ్మ.

ఇంట్లో అడుగు పెట్టగానే తన ఆఫీస్‌రూంలో కూర్చున్న యువకుణ్ణి చూస్తూనే ఆమె ధుమధుమలాడింది.

ఆ యువకుడు నవ్వుతూ ఎదురొచ్చి తనను తాను మిళింద్‌గా పరిచయం చేసుకున్నాడు.

కళ్ళద్దాలలోంచి తీక్షణంగా చూస్తూ ''నువ్వే నన్నమాట... టీనా వెంటపడింది''

''మీరనుకుంటున్నట్లుగా ఆకతాయితనంగా వెంటపడడం కాదు, మేమిద్దరం మనస్ఫూర్తిగా ప్రేమించుకుంటున్నాం'' అన్నాడు మిళింద్.

''నువ్వు టీనాను ప్రేమించావా లేక ఆమె వెనకవున్న ఆస్తిని ప్రేమించావా'' వెటకారంగా అంది దేవకి.

''నేను టీనాను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. నేనేమీ మీ ఆస్తి పాస్తులను ఆశించలేదు. మీరు నమ్మినా నమ్మకపోయినా మాది స్వచ్ఛమైన ప్రేమ...'' నిజాయితీగా చెప్పాడు మిళింద్.

''అందరూ పెళ్లయ్యేవరకూ ఇలాంటి కబుర్లే చెబుతారు. ఒక్కసారి తాళి కట్టారంటే చాలు ఆస్తికొట్టేసి అమ్మాయిని పీక పిసికి చంపేస్తారు...'' అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడింది దేవకి.

''మీరు వయసులో పెద్దవారని గౌరవిస్తాను. అనవసరంగా నోరు జారకండి''

''ఏంజేస్తావేంటి. కూటికి ఠికాణా లేని ప్రతి వెధవా చెప్పే మాటలివే''

ఆ మాటలు వింటూనే మిళింద్ ఆవేశం కట్టలు తెంచుకుంది. ''ఏయ్ బుడ్డీ. ఒక్కటిచ్చానంటే చచ్చూరుకుంటావ్. టీనా మొహం చూసి వదిలేస్తున్నాను'' ఆ అరుపులు వింటూనే ఎక్కడో తన రూంలో ఉన్న టీనా పరిగెత్తుకుంటూ వచ్చి మిళింద్‌ను పట్టుకుని ''కూల్‌డౌన్.. కూల్ డౌన్'' అంటూ అతన్ని అక్కడినుండి పంపించేసింది.

ఇదంతా అక్కడే నిల్చుని ఉన్న మేనేజర్ ద్వివేది, వాచ్‌మెన్ శుక్లా మిడిగుడ్లేసుకుని చూస్తూ ఉండిపోయారు.

* * *

మర్నాడు ఉదయం టీనా ఇంటిముందు పోలీసు జీపు ఆగి ఉంది. జీపులోనుండి ఎస్.ఐ భట్నాగర్ దిగి హడావిడిగా దేవకి మాథుర్ బెడ్‌రూమ్‌కు చేరుకున్నాడు.


దేవకీ మాథుర్ తన బెడ్‌పై నిర్జీవంగా పడి ఉంది. పక్కనే టీనా వెక్కి వెక్కి ఏడుస్తోంది.

''అసలేం జరిగింది?'' అక్కడున్న వారిని ఉద్దేశించి ప్రశ్నించాడు భట్నాగర్.

అక్కడే ఉన్న ద్వివేది రాత్రి దేవకీ మాథుర్‌కు మిళింద్‌కు మధ్య జరిగిన గొడవంతా వివరించాడు.

ఆ మిళిందే ఈ హత్య చేసి ఉంటాడన్న అనుమానం వెలిబుచ్చాడు.

# ఇలియానాకు ఎన్ని ఆఫర్లో!!



పవన్ కళ్యాణ్‌తో పాటు కుర్రకారును 'జల్సా'లో ముంచి మంచి హిట్ కొట్టిన ఇలియానాపై రకరకాల పుకార్లు పుట్టుకొచ్చాయి. బాలీవుడ్‌పై దృష్టిసారిస్తోందని, అందుకే ఇంతవరకు ఏ ప్రాజెక్టుపై సంతకం చేయలేదని సినీ వర్గాలు కోడైకూసాయి. కానీ పుకార్లు వట్టి మాటలే అని తేలిపోయాయి. ఈ మధ్యనే మూడు తెలుగు సినిమాల్లో నటించడానికి ఒప్పుకున్నట్లు తాజా సమాచారమ్. వై.వి.ఎస్. చౌదరి దర్శకత్వంలో ఓ చిత్రం జూలైలో మొదలుకానుంది. ఆ తర్వాత సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో రవితేజ సరసన ఓ చిత్రం, బి.ఎస్.వి. ఎన్ ప్రసాద్ నిర్మాణ సారధ్యంలో ఓ చిత్రం. కె. ఎస్. రవికుమార్ దర్శకత్వంలో విక్రమ్ సరసన తమిళ చిత్రంలో నటించనుంది. ఇంతకంటే మంచి ఆఫర్లు ఇంకేముంటాయి. హిట్‌ల హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్నాక అవకాశాలు లేకపోవడమా? పుకార్లన్నీ నిజాలు కావు. ఐతే అన్ని పుకార్లు ఒకలా వుండవు!

పక్కనే ఉన్న వాచ్‌మెన్ శుక్లాను విచారించగా "అర్ధరాత్రివేళ ఓ యువకుడు గోడదూకి పారిపోతుంటే వెంటపడ్డాను. అతను దొరకలేదు కాని అతని షూ ఒకటి దొరికింది" అంటూ షూ ఎస్.ఐ భట్నాగర్‌కి ఇచ్చాడు.

ఆ షూవంక చూస్తూనే టీనా అది మిళింద్ షూగా గుర్తించింది. శవాన్ని పోస్టుమార్టంకి పంపించారు. ఇక అనుమానం లేదు ఖచ్చితంగా ఉద్రేకంతో మిళింద్ చేసిన హత్యగా నిర్ధారించారు.

టీనా దగ్గర మిళింద్ అడ్రస్ తీసుకుని ఠాణేలో ఉన్న మిళింద్‌ను అరెస్ట్ చేశారు.

* * *

"మిళింద్ ఎందుకు తొందరపడ్డావు. నేను ఏదో విధంగా నచ్చచెప్పేదాన్ని. ఈహత్య చేసావెందుకు?" ఏడుస్తూ అడిగింది టీనా మిళింద్‌ను.

అదే ప్రశ్న ఎస్.ఐ భట్నాగర్ కూడా తరచి, తరచి ప్రశ్నించాడు.

అంతవరకూ నోరువిప్పని మిళింద్ టీనాను చూడగానే–

"మీరు నమ్మినా నమ్మకపోయినా నేనీ హత్య చేయలేదు" నమ్మబలికాడు మిళింద్.

"మరి అర్ధరాత్రి గోడ దూకుతుంటే వాచ్‌మెన్ శుక్లా చూశానన్నాడు" అడిగాడు ఎస్.ఐ.

"నేను అర్ధరాత్రి టీనా ఇంటికి వెళ్లిన మాట నిజమే అది కూడా టీనాను కలిసి జరిగిన గొడవకు క్షమాపణలు చెబుదామని వెళ్లాను. కాని అప్పటికే సోఫాలో వాళ్ళ బామ్మ నిర్జీవంగా పడి ఉండడం కనిపించింది. నేను భయంతో వెనుదిరిగాను. ఆ హడావిడిలో నా షూ అక్కడ పడిపోయింది."

"అంటే నువ్వు అక్కడకు చేరుకోకముందే దేవకీ మాథుర్ చనిపోయిందంటావా?" అడిగాడు ఎస్.ఐ.

"అదే జరిగింది" అన్నాడు మిళింద్.

"టీనా.. మరి నీకు ఇంకా ఎవరిమీదైనా అనుమానంగా ఉందా? మీ బామ్మ తదనంతరం ఈ ఆస్తి ఎవరికి చెందుతుంది" అంటూ ఆరాతీశాడు ఎస్.ఐ.

"నాకు పాతికేళ్ళ వయసు వచ్చిం తరువాత ఈ ఆస్తి నాకే దక్కుతుంది. అంతేకాదు నా పెళ్లి కూడా పాతికేళ్ల తరువాతే జరగాలని ఓ కండిషనుంది. ఈలోపుగా నేను పెళ్లి చేసుకుంటే ఈ ఆస్తిలో నాకు చిల్లిగవ్వ కూడా దక్కదు. ఈ ఆస్తి యావత్తూ మా నాన్న గార్డెన్ మనోజ్ మాథుర్ పేరున ఉన్న ట్రస్టుకు దక్కుతుంది"

"ఆ ట్రస్టు సభ్యులెవరు?"

"దానికి మేనేజర్ మా ద్వివేది అంకులే.."

"హత్య జరిగిన రాత్రి ద్వివేది ఎక్కడున్నాడు" అడిగాడు భట్నాగర్.

నాకు తెలీదు అన్నట్లుగా తలూపింది టీనా.

"అసలు నేరస్తులు దొరికేవరకూ మీకీ ఎడబాటు తప్పదు...'' అని టీనాను ఇంటికి పంపించాడు భట్నాగర్.

* * *

మేనేజర్ ద్వివేదిని పిలిపించిన ఎస్.ఐ "మేడం హత్య జరిగిన రాత్రి మీరెక్కడున్నారు?" అంటూ అడిగాడు.

"రాత్రి పదిగంటలకు ఓ అర్జంట్ ఫైలు ఎక్స్‌ప్రెస్ రోడ్డు దగ్గరున్న మా ఫ్యాక్టరీలో నుండి తీసుకురావడానికి వెళ్లాను. తిరిగొచ్చేసరికి రాత్రి పన్నెండుగంటలైంది. అప్పటికే ఈ ఘోరం జరిగిపోయింది" చెప్పాడు విచారంగా.

"ఎలా వెళ్లారు?"

"అమ్మగారి కారులోనే..."

"అంటే పదిగంటలకు వెళ్లి మళ్ళీ పన్నెండు గంటలకు తిరిగొచ్చారన్నమాట"

"అంతే జరిగింది" ద్వివేది మాట పూర్తికాకుండానే–

"మిస్టర్ ద్వివేది మీరు అబద్ధం చెబుతున్నారు. ఆ రెండుగంటలు ఇంటి ఆవరణలోనే తచ్చాడుతున్నావ్" ఎస్.ఐ మాటలు వింటూనే–

"లేదు సార్ నిజంగానే కారులో వెళ్ళొచ్చాను"

భట్నాగర్ టేబుల్ సొరుగులో నుండి ఓ డైరీ బయటకు తీశాడు "హత్య జరిగిన రాత్రి దేవకీ మాథుర్ కారు గ్యారేజ్‌కి రాత్రి ఎనిమిదిగంటలకు వచ్చింది. అప్పుడు కారు మీటర్ క్లోజింగ్ రీడింగ్ 16545 అని మేడం తన స్వహస్తాలతో ఈ డైరీలో రాసింది.

ఈరోజు వరకూ మీటర్‌లో అదే రీడింగ్ వుంది. నువ్వు చెప్పినట్లు ఎక్స్‌ప్రెస్ రోడ్‌కు వెళ్లి వస్తే కనీసం వందకిలోమీటర్లు రీడింగ్‌లో తేడా ఉండాలి. అలాంటిదేమీ లేదు. కారు అక్కడే వుంది.

మిళింద్, దేవకీ మాథుర్‌ల మధ్య గొడవను ఆసరాగా చేసుకుని నీ స్వార్థం కోసం ఆమెను నువ్వే హత్యచేశావు. ఆస్తి కొట్టేద్దామనుకున్నావు. దేవకి మేడం పిడికిట్లో కొన్ని వెంట్రుకలు దొరికాయి. డిఎన్ఏ టెస్ట్‌లో అవి నీ తలవెంట్రుకలుగా రుజువయ్యాయి" ఇంత వివరంగా ఎస్.ఐ చెబుతుంటే మేనేజర్ ద్వివేది తలవంచుకున్నాడు.

ద్వివేదిని పోలీసులు అరెస్టు చేశారు.

మిళింద్ నిర్దోషిగా బయటపడ్డాడు.

కేసు విచారణలో వుంది.

★